క్లుప్తంగా

నియామకం


బండి మల్లేశ్

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో ఇన్‌చార్జిగా బండి మల్లేశ్ నియామకమయ్యారు. ఈమేరకు తెలంగాణ మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్, రాష్ట్రమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌కు మల్లేశ్ కృతజ్ఞతలు తెలిపారు.


పింగిళి రాకేశ్

జమ్మికుంట: మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన పింగిళి రాకేశ్‌ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల కో ఇన్‌చార్జిగా నియమిస్తూ తెలంగాణమత్స్యశాఖ చైర్మన్, కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు సాయి కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాకేశ్ మాట్లాడుతూ.. నియామకానికి సహకరించినవారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

4న మండల సభ

శంకరపట్నం: శంకరపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మే 4న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పున్నం మల్లయ్యకు సేవా స్వర్ణనంది అవార్డు

సైదాపూర్: మండలంలోని ఎలబోతారం గ్రామానికి చెందిన పున్నం మల్లయ్యకు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 19వ వార్షికోత్సవం సందర్భంగా సేవా స్వర్ణనంది, ఉగాది జాతీయ పురస్కారం ఆదివారం హైదరాబాద్‌లో అందజేసింది. మల్లయ్య జానపద, డప్పు నృత్యం, నాటక రంగంలో కళాకారుడు. గతంలో జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల్లో కళా ప్రదర్శనలిచ్చారు. ఇప్పటికీ గ్రామాల్లో రామాయణం, చిడుతల రామాయణం వంటి నాటకాలకు పంతులుగా పని చేస్తున్నారు. మల్లయ్యకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు


పనులు అడ్డుకుంటున్న గ్రామస్తులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ ఊర చెరువు నుంచి రైల్వే కాంట్రాక్టర్ అక్రమంగా మట్టిని తరలిస్తుండడంతో గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. చెరువులోని మట్టి తీయడంతో వ్యవసాయ బావుల్లో నీరు లేకుండా పోతుందని, భూగర్భజలాలు తగ్గుతాయని రైతులు వాపోయారు. మట్టి తరలింపును అధికారులు తక్షణం నిలిపివేయాలని కోరారు.

పోలీసుల తనిఖీలు


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై చేరాలు

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్ చౌరస్తాలో ఎల్ఎండీ ఎస్సై బెల్లం చేరాలు కరీంనగర్ నుంచి వచ్చిన స్పెషల్ పోలీసులు సోమవారం రాత్రి ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి అలుగునూర్ చౌరస్తా మీదుగా హైదరాబాద్, వరంగల్‌కు నగదు, మద్యం, ఆయుధాలు అక్రమంగా రవాణా చేసే అవకాశాలున్నాయని వాహనాల తనిఖీ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. డిస్ట్రిక్‌గార్డ్స్ పలు భాగాలుగా విడిపోయి తనిఖీ చేశారు. సీపీ అభిషేక్ మహంతి ఆదేశాలతో తనిఖీలు చేపడుతున్నామని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్సై సిబ్బందికి సూచించారు.

ఏడుగురిపై కేసు

గన్నేరువరం: అనుమతి లేకుండా సమావేశం, భోజనాలు ఏర్పాటు చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాండ్ర నరేశ్ తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి సాయిఫంక్షన్‌హాల్‌లో సమావేశంతో పాటు భోజనాలు ఏర్పాటు చేశారని వడ్డే ఆదిరెడ్డితో పాటు ఫంక్షన్‌హాల్ నిర్వాహకులు వడ్డే రాజిరెడ్డిపై గన్నేరువరం ఎంసీసీ టీమ్ ఇన్‌చార్జి శంకర్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలో ఎలాంటి అనుమతుల్లేకుండా వెంచర్ చేశారు. అందులో అక్రమంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన ఐదుగురిపై పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

వైభవంగా పట్నాలు, బోనాలు


చిగురుమామిడి: చిన్నముల్కనూర్‌లో నెత్తిన బోనాలతో ఊరేగింపుగా తరలివస్తున్న మహిళలు


ఆలయంలో కొలువుదీరిన దుర్గమ్మతల్లి


చొప్పదండి: పూజలు చేస్తున్న బండి సంజయ్

చొప్పదండి: పట్టణంలోని ముదిరాజ్‌లు సోమవారం పెద్దమ్మ పట్నాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి బోనాలతో ఆలయానికి తరలివెళ్లిన మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం పూజారులు పెద్ద పట్నం వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వేర్వేరుగా పట్నాల కార్యక్రమానికి హాజరై పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామంలో దుర్గమ్మతల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠాపన చేయగా అన్ని కులాలకు చెందిన మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య నెత్తిన బోనాలతో శివసత్తుల పూనకాలు, బైండ్ల కళాకారుల నృత్యాల మధ్య ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈసందర్భంగా కళాకారులు దుర్గమ్మ పుట్టుక, చరిత్రను కథ రూపంలో వినిపించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎంపీటీసీ పెసరి జమున రాజేశం, మాజీ సర్పంచ్ ముప్పిడి వెంకటనర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరేశ్, రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా కమిటీ సభ్యుడు సాంబారి కొంరయ్య, ఆంజనేయులు, బరిగెల సదానందం, చిరంజీవి, వెంకన్న, శ్రీనివాస్, శ్రీకాంత్, సాంబారి బాబు, తిరుపతి, కయ్యం సారంగం, రాజిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పరిశీలన


తాడికల్‌లో తేమశాతాన్ని పరిశీలిస్తున్న మధుకర్‌రెడ్డి

శంకరపట్నం: ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాడికల్ సింగిల్ విండో చైర్మన్ మధుకర్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని తాడికల్, కేశవపట్నం, కరీంపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఎండల తీవ్రత మూలంగా కొనుగోలు కేంద్రాల్లో ఓఆర్ఎస్, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని సెంటర్ ఇన్‌చార్జిలకు సూచించారు. ఈకార్యక్రమంలో స్టాఫ్‌అసిస్టెంట్ వేణు, రైతులు, తదితరులు ఉన్నారు.

సీఎం బహిరంగ సభకు భారీ బందోబస్తు


మాట్లాడుతున్న కరీంనగర్ డీసీపీ లక్ష్మీనారాయణ

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ డీసీపీ(లా అండ్ ఆర్డర్) లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టణంలోని ఓప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏసీపీ, సీఐలు 300 మంది పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఆర్మ్‌డ్ రిజర్వ్ అకునీకుమార్, ఏసీపీ టీటీసీ సుందర్‌రావు, హుజూరబాద్ డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, జమ్మికుంట టౌన్ సీఐ రవి, రూరల్ సీఐ కిషోర్ పాల్గొన్నారు.

శభాష్.. నసీరొద్దీన్


వాటర్‌ఫ్రిడ్జ్‌ను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

వీణవంక: ఎండలు మండుతున్నాయి... మును పెన్నడూ లేనివిధంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జనం దాహార్తి తీర్చడానికి సొంతంగా వాటర్ ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచాడు మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన మహ్మద్ నసీరొద్దీన్. వివిధ గ్రామాల నుంచి చల్లూరు బస్టాండ్‌కు ప్రయాణికులు వస్తుంటారు. ఇక్కడి నుంచి కరీంనగర్, వీణవంక, జమ్మికుంట ప్రాంతాలకు వెళ్తుంటారు. ఎండ వేడిమికి తట్టుకోలేక తల్లడిల్లుతున్న ప్రజల కోసం 24గంటలు చల్లని తాగునీరు వాటర్‌ఫ్రిడ్జ్ ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించగా శభాష్..నసిరొద్దీన్ అంటూ గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఇమామ్ ముంతసేమ్ అలం, అన్సారి,. ఫసియొద్దీన్, మునీరొద్దీన్, జక్కు నారాయణ, షరీఫ్‌హొద్దీన్, జమిల్, మోసిన్, ముస్తాక్, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


వీణవంక: కండువా కప్పుతున్న వొడితెల ప్రణవ్

రామడుగు: మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. గంగాధరలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నుంచి కొక్కెరకుంట సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, గుండి ఎంపీటీసీ మద్ది శ్యాంసుందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు నాగుల సంగీతరాజశేఖర్‌గౌడ్, బండ అజయ్‌రెడ్డి, బక్కశెట్టి నరసయ్య, బీజేపీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు ఎడవెల్లి రాజిరెడ్డి, నాయకులు బడుగు పద్మచెంద్రయ్య, మన్నె గంగామల్లు, పెంటి శంకర్‌లతో పాటు 500 మంది కార్యకర్తలు పార్టీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్‌లో కష్టపడినవారికి గుర్తింపు లేకుండాపోయిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరు కష్టపడి పని చేసి విజయం సాధించేందుకు కృషి చేయాలని, ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ జవ్వాజీ హరీశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పుల అంజనీప్రసాద్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి, మాజీ ఎంపీపీ వంచ సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ ఎస్సీ డిపార్టుమెంట్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరెల్ల ఆంజనేయులుగౌడ్, నాయకులు కోల రమేశ్, అమిరిశెట్టి సుధాకర్, పూరెల్ల రత్నాకర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు అంబాల రాజు, పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్లపల్లి నాగరాజు, ఎగ్గెటి సదానందం, మ్యాకమల్ల అశోక్, ఇనుగాల సతీశ్, చెన్నవేల రమేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చాడ రాజేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. వొడితెల ప్రణవ్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, ఎంపీటీసీ జీడి దేవేందర్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పోరెడ్డి తిరుపతిరెడ్డి, కామిడి శ్రీపతిరెడ్డి, కల్వల సదాశివరెడ్డి, గట్టయ్య తదితరులు ఉన్నారు.

ఉచిత విద్య, హాస్టల్ వసతి



ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులతో సదిశ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, తదితరులు

చొప్పదండి: మండలంలోని రెవెల్లి గ్రామానికి చెందిన సదిశ స్వచ్ఛంద సంస్థ గతేడాది డిసెంబర్‌లో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు మాథ్స్ టాలెంట్ టెస్టు నిర్వహించింది. పరీక్షలో ఎంపిక చేసిన 30 మందికి ప్రైవేట్ కళాశాలల్లో హాస్టల్ వసతితోపాటు ఉచిత విద్య అందించనున్నట్లు సంస్థ డైరెక్టర్ ద్యావ నవీన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం ఎంపిక చేసిన విద్యార్థులను కరీంనగర్‌లోని చైతన్య జూనియర్ కళాశాలలో చేర్పించి అడ్మిషన్ కార్డులు అందించారు. రెండేళ్ల ఇంటర్ విద్యను ఉచితంగా అందిస్తామన్నారు. పదేళ్లుగా గణిత ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జగన్ మోహన్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిప్పారపు శ్రీనివాస్

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని శ్రీనివాస విజన్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సామాజికవేత్త తిప్పారపు శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. వేసవి దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొదిల శివకుమార్, మంద సతీష్, నాగరాజు, మహమ్మద్ ఇస్తాక్, కార్తీక ఆనంద్, బందారి కిష్టయ్య, కేసని నందన్ ఉన్నారు.

విద్యుత్ మోటార్ల వైరుచోరీ

రామడుగు: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులకు చెందిన విద్యుత్ మోటార్ల వైరును దొంగలు ఎత్తుకెళ్లారని గ్రామస్తులు తెలిపారు. వరదకాలువకు విద్యుతు మోటార్లు ఏర్పాటు చేసుకొని పంట పొలాలకు నీరు అందించుకుంటున్నారు. కాలువ గట్టుపైన విద్యుల్ స్టార్టర్ నుంచి మోటారు వరకు వెళ్లే వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. వైరు విలువ దాదాపు రూ.లక్ష పైగానే ఉంటుందని రైతులు వెంకట్‌రెడ్డి, రాజయ్య, వెంకటేశ్, రవి, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి మరికొంత మంది ఆవేదన వ్యక్తం చేశారు.

పరామర్శ

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామానికి చెందిన మామిండ్ల కొంరయ్య, లంక ఎల్లయ్య, దొంతరవేని నర్సవ్వ ఇటీవల మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు సోమవారం పరామర్శించారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం


రామడుగులో ప్రచారం చేస్తున్న నాయకులు,


శంకరపట్నం: కొత్తగట్టులో మోదీ మాస్కులతో చిన్నారులు


జమ్మికుంట: ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని మోత్కులగూడెంలో కరీంనగర్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా సోమవారం ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులకు టికెట్లు కేటాయించారని ఆరోపించారు. బీసీ అభ్యర్థి ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు బీసీ, ఎస్సీ,ఎస్టీ సామాజిక వర్గాలు మద్దతుతో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రధాని మోదీ ప్రభుత్వం 27 మంది బీసీ ఎంపీలకు మంత్రి పదవులు ఇచ్చి బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పేదలకు బీసీ మంత్రులు సేవ చేసే విధంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్, పోలింగ్ బూత్ అధ్యక్షుడు ఆకుల కిషన్, కిసాన్‌మోర్చా పట్టణ అధ్యక్షుడు ఉడుగుల రవికుమార్, నాయకులు పల్లపు రవి, తాటికంటి మల్లయ్య, ఎగ్గని చందు, మోలుగూరి అఖిల్, హరిప్రసాద్, అరుణ్, విష్ణు,కమల్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని రామడుగు, గోపాల్‌రావుపేట, లక్ష్మీపూర్, కోరటపల్లి గ్రామాలలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జిన్నారం విద్యసాగర్, కట్ట రవీందర్, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, ఎడవెల్లి లక్ష్మణ్,మాడిశెట్టి జయంత్, ఉత్తం కనుకరాజ్‌లతో పాటుగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. మండలంలోని గద్దపాక, కొత్తగట్టు, కరీంపేట, మొలంగూర్ గ్రామాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి అలివేలి సమ్మిరెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. గద్దపాక, మొలంగూర్‌లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. చిన్నారులు ప్రధాన మంత్రి మోదీ మాస్కులు ధరించి ప్రచారంలో పాల్గొనడం ఆకర్షణగా నిలిచింది. కోఆప్షన్ సభ్యుడు ఖాజాపాషా, దండు కొంరయ్య, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని రేకొండలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని గడపగడపకూ తిరుగుతూ కమలానికి ఓటువేయాలని కోరారు. మహిళలకు బొట్టుబిళ్లల ప్యాకెట్లపపై దీర్ఘ సుమంగళి భవ అనే అక్షరాలతో ప్రింట్ చేయించిన కార్డులను ఇస్తూ వినూత్న రీతిలో ప్రచారం చేశారు. మరో ఐదేళ్ల పాటు పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత రేషన్ అందాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. ఎన్నికల ప్రచారంలో బూత్ అధ్యక్షుడు దాసరి సాగర్‌రెడ్డి, ఇన్‌చార్జి గందె చిరంజీవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బొమ్మనపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలశాఖ ఉపాధ్యక్షుడు కంది శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలతో ఆగం కావొద్దు

- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్


కందుగులలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్: కాంగ్రెస్, బీజేపీలతో ప్రజలు మోసపోద్దని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ మండలంలోని కందుగుల, కనుకులగిద్ద గ్రామాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో నలుగురు బీజేపీ ఎంపీలున్నా ఒక్క నవోదయ స్కూల్ ఎందుకు తేలేదని ప్రశ్నించారు. తాను 2019లో ఎంపీగా గెలిస్తే నవోదయ తెచ్చేవాడినని, పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్‌లో రెండేళ్లకు ఒక్క సీఎం మారుతాడని విమర్శించారు. కాంగ్రెస్ ఉత్తమాటలు, ఉద్దెర హామీలు ఇచ్చిందని ఎద్దేవా చేశారు. మళ్లీ ఇప్పుడు బీజేపీ మాటలు నమ్మి మరో సారి ప్రజలు మోసపోవద్దన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్‌కు రూ. వెయ్యి కోట్లతో స్మార్ట్ సిటీ, జాతీయ రహదారులు తీసుకువచ్చానని పేర్కొన్నారు. బండి సంజయ్ కి కనీస అవగాహన లేదని, జాతీయ రహదారి, నూతన రైల్వే లైన్ల ఏర్పాటు విషయం బండి సంజయ్‌కి అసలే తెలియదన్నారు. ఐదేళ్లుగా ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఒక్క రూపాయి నిధులు తేలేదని విమర్శించారు. అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే తెలంగాణను మళ్లీ ఆంధ్రాలో విలీనం చేసి సమైక్య రాష్ట్రంగా ఏర్పాటు చేస్తారని, బీజేపీ దొంగ మాటలు, కాంగ్రెస్ గారడీ మాయలో పడొద్దన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కాంగ్రెస్ ఎన్నికల్లో లబ్ధి పొందటానికి ప్రజలను మోసం చేస్తోందన్నారు. కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్‌ను ఆశీర్వదించి ఓట్లు వేసి గెలిపిస్తే జోడెద్దుల్లాగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, నాయకులు ఐలయ్య, బెల్లి రాజయ్య, సతీశ్, కాసం రఘుపతి రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కానుగంటి శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని కొండపల్కలలో బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ గెలుపు కోసం కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలి పించాలని కోరారు. బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు అడప శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, కొత్తిరెడ్డి సంపత్ రెడ్డి, గట్టు శ్రీధర్, కదారి రమేశ్, తదితరులున్నారు.

రైల్వే హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కరీంనగర్‌రూరల్: రైల్వే హమాలీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ రైల్వేస్టేషన్‌లోని హమాలీ సంఘం కార్యాలయంలో మే డే 138వ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎన్నో పోరాటాలు చేసి, సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చిందన్నారు. 24 గంటలపాటు రైల్వేస్టేషన్‌లో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్న హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, వారికి ఇళ్లు నిర్మించాలని, కార్మిక చట్టాల రద్దును విరమించుకోవాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మేడేను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వే హమాలీ సంఘం అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, కార్యదర్శి గాండ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు దాసరి ప్రభాకర్, ప్రతినిధులు మహేందర్, రఘుపతి, రాజు, శంకరయ్య, రవీందర్, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.